# అన్నపూర్ణ : అప్పుడూ, ఇప్పుడూ

(కథానిక)

మిఠాయి నములుతున్నానే గాని నోరంతా చేదుగా వుంది కళ్ళవెంట నీళ్లు కమ్ముతున్నాయి. మిఠాయి తీపిసరుకే గాని...అసలు కథంతా సాంతంగా వినండి.

విఠల్ రావు లక్షాధికారి. నాకు చిన్ననాటి స్నేహితుడు. చాలారోజులనుండి దగ్గువ్యాధితో బాధపడుతున్నాడు. ఎంతమందో డాక్టర్లు మారారు. కాని రోగం మారలేదు. రాత్రిళ్లు దగ్గుతెరవచ్చి మనిషి ఉక్కిబిక్కయి పోయేవాడు. నర్సింగు చేసేందుకు అతను "ఊ" అంటే కోటి మంది వస్తారు. కాని యింటి యిల్లాలు అన్నపూర్ణతో సమానంగా ఎవరు చూడగలరు? డాక్టర్లుగూడా ఆమె జాగ్రత్తకు, సహనానికి ఆశ్చెర్యపోంది వేరే నర్సులు అనవసరమన్నారు. విఠల్ రావుది చాలా పెద్దకుటుంబం. అన్నలు, తమ్ముళ్లు, మేనమామలు, మేనత్తలు-ఎంతో పెద్ద బలగంవుంది. చుట్టపు చూపుక్రింద అందరూ వచ్చారు. చూచారు. ఒక నెల, రెండు నెలలూ వుండి హాయిగా కాలక్షేపం చేశారు. భర్తకు సపర్యలు చేస్తూ, యింటిపెత్తనంగూడా అన్నపూర్ణే నిర్వహించేది. పొద్దస్తమానము కాఫీలు, ఫలహారాలు, భోజనాలు—ఇల్లంతా ఒక పెళ్ళి యిల్లులా అయింది. విఠల్ రావు జబ్బు "క్షయ" అని చివరకు డాక్టర్లు అందరూ ఏకగ్రీవంగా తేల్చేశారు. చుట్టాలు ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు. మర్నాడే ఎక్కడివాళ్లు అక్కడికి వెళ్ళిపోయారు.

రోజూ సాయంకాలం బ్యాంకు మూయగానే వాళ్ళయింటికి వెళ్ళి రోగిని పలకరించి వచ్చేవాణ్ణి. ఆవేళ నేను వెళ్ళేసరికి విఠల్ రావు మంచంమీద పడుకొని విపరీతంగా దగ్గుతున్నాడు. నేవెళ్ళి పక్కవున్న కుర్చీలో కూర్చున్నాను. దగ్గు కొంచెం తగ్గింది. నా వైపు తిరిగి "ఈ దగ్గు, యీ ప్రాణం ఎప్పుడు... ఎప్పుడు..." మాట్లాడ లేకుండా వున్నాడు.

నేను కొన్ని వూరడింపు వాక్యాలు పల్కాను.

ఇంతలో లోపలినుంచి "కప్పు" పట్టుకొని అన్నపూర్ణ వచ్చింది.

"ఏమిటీ, అది" అన్నాడు రొప్పుతూ.

"పాలు"

"అబ్బా మళ్ళీపాలా! కాసేపన్నా నన్ను బాధించకుండా వుండలేవా! ఇప్పుడేకదా మందు తాగింది పండ్లరసంకూడా తీసికొంటిని!"

"డాక్టరు లోపలకు యెక్కువ ఆహారం యివ్వాలన్నాడండి. ఇవి కొంచెం తాగండి. మళ్ళీ రాత్రిదాకా మీజోలికి రాను" అంటూ కప్పును బల్లమీద పెట్టి ఆయన భుజాన్ని పట్టుకొని తిన్నగా లేవదీసింది. రెండు గుక్కలు త్రాగి "ఇక నాకువద్దు బాబోయ్- తీసెయ్" అన్నాడు.

"ఎలాగండీ అలా పిల్లాడిలా మారాంచేస్తే మీరైనా చెప్పండి అన్నయ్యగారూ!" అంటూ నావైపు చూచింది.

నేనుకూడా అతణ్ణి పాలు తాగమని సలహా యిచ్చాను "సరే" అని మరొక్క గుక్క మాత్రమే తాగి కళ్లు మూసుకొని మంచంమీద వాలాడు. కప్పు తీసికొని ఆమె లోపలకు వెళ్ళింది. రెండు నిమిషాలు ఆగి నేను వరండాలోకి వచ్చి చూస్తునుగదా అన్నపూర్ణ మిగిలిపోయిన ఆ కప్పులోని పాలన్నీ తాగేస్తున్నది. ఆశ్చర్యం వేసింది. తాగటం పూర్తి అయిన తర్వాత ఆమె నావైపు చూసింది. పట్టుబడ్డ దొంగలాగా కొంచెం సిగ్గు, భయంతో నిలుచున్నది.

"నీవు చేస్తున్న పని ఏమిటమ్మా?" అన్నా.

ముఖం తిప్పుకుని "ఎబ్బే ఏమీ లేదండీ" అంటూ తెలివి తెచ్చుకొని "అన్నగారూ, మీరు చూడనే చూచారు. మరి యెవరికీ చెప్పకండి బాబూ" అన్నది.

అట్లూరి విశ్వేశ్వరరావు

"ఎవరికీ చెప్పను గాని, ఆ పాలను నువ్వెందుకు తాగుతున్నావమ్మా?" అన్నాను.

ఆమె కొంచెం నవ్వి. "భర్త త్యజించిన పాలు భుజించటంలో తప్పేముంది. అన్నయ్యగారూ" అన్నది

"తప్పు. అయ్యయ్యో ఆయన క్షయరోగి. ఆయన క్షయరోగి అనీ, క్షయరోగం అంటు వ్యాధి అని తెలిసుకుంటమ్మా బాధపడుతున్నది ఆయన ఒక్కడే కాక ..." నేను మాట్లాడటం పూర్తి కాకముందే ఆమె అందుకొని "ఏం, అన్నయ్యగారూ, ఆయన పోయిన తర్వాత నే వుండి ఏం లాభం చెప్పండి" అన్నది. నేను ఆమెకు ఎన్నో విధాల చెప్పాను. అన్నిటికీ తల వూపింది. చివరకు విషాదంగా ఒక నవ్వు నవ్వింది.

విఠల్ రావు జబ్బు నానాటికి విషమరూపం దాలుస్తున్నది. ఇంకో యిద్దరు "స్పెషలిస్టు"లు వచ్చి పరీక్ష చేశారు "ఎక్సురే" తీశారు. ఒక ఊపిరితిత్తు చెడిపోయింది. మరొకటి యింకా చెడలేదు తాంబరం శానిటోరియం వెళ్ళి 'లంగ్' అపరేషన్‌లు చేయించమని సలహాయిచ్చారు. డబ్బుకేం కొదువలేదు. మర్నాడే మద్రాసు ప్రయాణం కట్టారు. అన్నపూర్ణ వెంట వెళ్లింది.

ఆ తర్వాత వాళ్ళను గురించి నాకంతగా తెలియలేదు. రెన్నాళ్ళు ఉత్తరాలు వ్రాశాడు. జబ్బు నయమవుతున్నదని—తాను కోలుకుంటున్నానని." అటు తర్వాత ఆయన దగ్గరనుండి ఉత్తరాలు రాలేదు. నేను వ్రాయలేదు. నేను-నా బ్యాంకి గుమాస్తాపని-మరో ప్రపంచంతో నిమిత్తం ఏముంది! ఎవరో ఆ మధ్య విఠల్ రావు "స్విట్ జర్లాండు" వెళ్లాడన్నారు. వెళ్ళవచ్చు ఆయనకేం మహారాజు!

పది సంవత్సరాలయింది. విఠల్ రావు స్మృతి నా మనోవీధినుండి పూర్తిగా విడిపోయింది. ఒకరోజున అకస్మాత్తుగా విఠల్ రావ్ దగ్గరనుండి ఒక ఉత్తరం వచ్చింది. అందులో విశేషం, తాను మంగళవారం ఆ వూరు వస్తున్నానని, వీలుగావుంటే వచ్చి కలుసుకోమని.

ఆవేళే వారి యింటికి వెళ్ళాను. విఠల్ రావును చూచినప్పుడు గుర్తు పట్టలేక పోయినాను. పూర్తిగా ఆరోగ్యవంతుడైనాడు మరో జన్మ ఎత్తినట్లుంది. నన్ను ఎంతో ఆప్యాయంగా ఆహ్వానించాడు. నేను అడిగాను "మీరు పూర్తిగా కోలుకున్నారు కదూ?"

"అవును. పూర్తిగా ఆ జబ్బు నయమైపోయింది"

ఆయన ఏయే డాక్టర్ల దగ్గర మందు తిన్నది, ఎలా తన రోగం నయమైంది విపులంగా చెప్పబోతున్నాడు.

"మీరు స్విట్ జర్లాండు వెళ్ళారుట కదండీ—" అడిగాను.

"అవును—ఏం దేశమండీ! అహాహా! మనం పుస్తకాల్లో చదివిన దానికన్నా అందమైన దేశం" అంటూ లేచి "రావోయ్ మేడమీదకు వెళ్ళి టీ త్రాగుదాం" అన్నాడు నావైపు తిరిగి "ఏమోజుట్టు అప్పుడే తెల్లపడ్డదే ఆ యూరప్‌లో చూచావా - మనుష్యులకు యవ్వనం యాభై దాటితేగాని ప్రవేశించదోయ్" అన్నాడు.

ఆయనకు యాభై దాటినయ్ అని గుర్తుకు వచ్చినాయి - నేను నవ్వుకున్నాను. ఒక స్త్రీ రెండు పళ్ళేలు పట్టుకవచ్చి అక్కడ పెట్టింది. ఈమె అన్నపూర్ణా! ఎంత మారిపోయింది! నా ఆశ్చర్యానికి ఆమె గాభరాపడి కాబోలు "టీ తెస్తాను" అని వెళ్ళిపోయింది. ఎంత మార్పు!

నేను విఠల్ రావు వైపు తిరిగి "అన్నపూర్ణ పూర్తిగా మారిపోయింది నేను గుర్తు పట్టలేకపోయినాను" అన్నాను. విఠల్ రావు నా వైపు రెండు నిముషాలు అదో విధంగా చూచి అన్నాడు:

"అవును అన్నపూర్ణ మారిపోయింది, నీవు ఇప్పుడు చూచే అన్నపూర్ణ, పూర్వం నీవు చూచిన అన్నపూర్ణ కాదు ఆమె యీ లోకాన్ని వదలివేసి అప్పుడే రెండు సంవత్సరాలయింది. ఆమెకు కూడా క్షయ వచ్చింది. రెండు ఊపిరితిత్తులకున్నూ వ్యాపించింది. చివరకు ఆమె పేగులకుకూడా ఆ వ్యాధి అంటుకున్నది. నేను ఎంతో ధనం వ్యయం చేశాను కాని లాభం లేకపోయింది."

మేమిద్దరం కొంతసేపు మౌనంగా కూర్చున్నాము. విఠల్ రావు మళ్లీ అందుకొని "చేసేం చెయ్యను? మళ్లీ పెళ్లి చేసుకోక తప్పలేదు. చివరకు ఆ పేరుగల మరో అన్నపూర్ణ తటస్థపడ్డది. ఆమె తిరిగిరాదు. ఆమె పేరు మరవలేను. ఆమె... పేరు..." అన్నాడు అదో రకంగా పిచ్చివాడి మోస్తరుగా.

అన్నపూర్ణ టీ "ట్రే" పట్టుకొని వచ్చింది. తన బల్లమీద అన్ని పదార్థాలు వుండటం చూచి విఠల్ రావు "అబ్బో, యిన్ని పదార్థాలు నేను తినలేను. ఇన్నెందుకు తీసెయ్" అన్నాడు.

అన్నపూర్ణ అంటున్నట్లుగా వినపడ్డది:

"మీరు యివన్నీ తినాలి. ఈ మధ్య బొత్తిగా తినటం తగ్గించేశారు." నావైపు తిరిగి అంది: "బాబూ, మీరన్నా చెప్పండి"—

"అతనికి మైసూర్ పాక్ అంటే ఇష్టం. ఇంకొకటి యివ్వవే" అని అందుకొని ఒకటి నాకు యిచ్చాడు.

మిఠాయి తింటున్నానే గాని నోరంతా చేదు చేదుగా వుంది!

(మూలం: ఒక బెంగాలీ కథ)

సంపాదకునకు లేఖ

# గుడివాడ కళాశాల

రెండేళ్ళ క్రితం గుడివాడలో ఒక కళాశాల స్థాపించబడింది. కొందరు అభిమానులు ఒక కమిటీగా ఏర్పాటై వూరూరా తిరిగి ధనం సేకరించి కాలేజీ స్థాపనకు దోహదమిచ్చారు. ఇప్పటికే ఆ కళాశాల ఆకమిటీ అధ్వర్యాన నడుపబడుతున్నది. కమిటీ మెంబరు కాలేజీకి సంబంధించిన ప్రతివిషయంలోనూ జోక్యం కలిగించుకుంటున్నారు. చివరకు కాలేజీ యూనియన్ తరఫున ఒక మీటింగు యేర్పాటు చేయాలనుకున్నా కమిటీ మెంబర్ల ఇష్టం మీదే ఆధారపడవలసివుంది. లైబ్రరీలోకి ఒక క్రొత్త పుస్తకం తెప్పించాలన్నా మెంబర్ల పెర్మిషన్ తెచ్చుకోవలసిందే. "ఆంధ్రాభ్యుదయ వారోత్సవము"ల సందర్భంలో కమిటీవారు సేకరించిన నాటికలు మాత్రమే ప్రదర్శించవలసిన దుర్గతి కూడపట్టింది. ఇంటర్ మీడియట్ ఎడ్మిషన్లకు సీట్లు ఇవ్వడం కూడా ఆ కమిటీయే చూచుకుంటోంది.

ఇంకొక విచిత్రం కూడా ఈమధ్య జరుగుతోంది. ఆ కమిటీవారు అనుకొన్నంత ధన సహాయము మా గ్రామం చేయలేక పోయినందున మా గ్రామ విద్యార్థు లెవ్వరికీ సీటు దొరకదని బెదిరిస్తున్నారు. సీటు కావలసినవారు 250 రూపాయలు ఇవ్వవలయునని బలవంతపరచుచున్నారు. ఆ కమిటీవారు విద్యాభిమానులే కావచ్చు. కళాశాల అభివృద్ధికోసం తంటాలు పడవచ్చు. కాని ఒక ప్రత్యేక గ్రామంవాడవటం అనే నేరంమూలంగా 500 మార్కులకు 357 మార్కులు వచ్చిన మా గ్రామ విద్యార్థి ఒకనికి సీటు దొరుకకపోవడం శోచనీయం. ఏ ఆశయంకోసమైతే కాలేజీని స్థాపించారో దాన్ని విస్మరించి మంచి విద్యార్థులకు స్థానంలేకుండా చేయటం సహించరాని విషయం. అదేగాకుండా నిర్భయంగా "మీ అంగలూరు వాళ్ళకు సీట్లు ఇవ్వము" అని బహిరంగంగా చెప్పడం అధికార దుర్వినియోగమే అవుతుంది. చందా పోగుచేసినంత మాత్రాన కాలేజీ ఆ కమిటీయొక్క స్వంత ఆస్తి కాదని గుర్తించడం ఎంతైనా అవసరం. కాబట్టి ప్రభుత్వంవారు ఈ కాలేజి కమిటీయొక్క వింత చర్యలను గుర్తించి సీట్ల విషయంలోనూ, తదితర విషయాలలోనూ కమిటీయొక్క జోక్యం తగ్గించి న్యాయం చేకూర్చగలరని నమ్ముతున్నాను.

టి. వి. నరసింహారావు
అంగలూరు, కృష్ణాజిల్లా.